క్లుప్తంగా

తుప్పలతో తిప్పలు



కోట రోడ్డులో ఏపుగా పెరిగిన తుప్పలు

కె.గంగవరం: ఏటిగట్టుపై రొడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. వర్షాకాలం కారణంగా కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా పెరిగి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికితోడు తప్పలు రోడ్డు మధ్యకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించలేక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. గతంలో తుప్పలను తొలగించినప్పటికీ, మళ్లీ అవి పెరిగిపోయాయని అంటున్నారు. పూర్తి స్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలో ఉన్న మలుపు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. రెండు సార్లు ప్రమాదకర మలుపులు ఉండడం, పక్కనే చెరువు ఉండడం వల్ల ప్రయాణికులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు మలుపుల వద్ద కూడా వేగాన్ని తగ్గించకుండా ప్రయాణిస్తున్నారని చెబుతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి, ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

23న ఉపాధి గ్రామసభలు

కపిలేశ్వరపురం: ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఎంపిక కోసం ఈ నెల 23న మండలంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అద్దంకివారిలంక, కాలేరు, కపిలేశ్వరపురం, నల్లూరు, నేలటూరు, వడ్లమూరు, వాకతిప్ప గ్రామాల్లో సభలు ప్రారంభం అవుతాయన్నారు. 10.30 గంటలకు అంగర, 11 గంటలకు నిడసనమెట్ట, టేకి, తాతపూడి, వెదురుమూడి, 11.30 గంటలకు కేదారిలంక, కోరుమిల్లి, నాగులచెరువు, మధ్యాహ్నం 2 గంటలకు మాచర, పడమర ఖండ్రిక, 2.30 గంటలకు వల్లూరు, 3 గంటలకు అచ్యుతాపురం సచివాలయం వద్ద ఉపాధి గ్రామ సభలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు వివరించారు. ఆయా సభలలో గ్రామంలో చేపట్టేందుకు వీలున్న పనులను ప్రజలు ప్రతిపాదించాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

రామచంద్రపురం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా రాజీవ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రామచంద్రపురం నియోజవర్గ ఇన్‌చార్జి కోట శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు మెహతాబ్ ఖురేషిఅలీ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిప్రసాద్

రామచంద్రపురం: సమాజంలో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కౌన్సిలర్, మున్సిపల్ విప్ సాయిప్రసాద్ వాడ్రేవు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పదో సచివాలయం పరిధిలోని 23వ వార్డుకు చెందిన డ్వాక్రా మహిళా శక్తి సంఘ సభ్యులకు సచివాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళల అభివృద్ధికి ప్రవేశ పెడుతున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడకుండా, పర్యావరణ పరిరక్షణకు మహిళలు పాటుపడాలని కోరారు. టౌన్ మిషన్ కోఆర్డినేటర్ మంగాదేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ మహాలక్ష్మి, రిసోర్స్ పర్సన్ భవాని పాల్గొన్నారు.

జీవితానికి ఇంధనం

- అవకాశాలు అందిపుచ్చుకుంటున్న 'అతివలు'
- పెట్రోల్ బంకుల్లో పని చేస్తూ.. కుటుంబానికి తోడుగా
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం



పెట్రోల్ బంకులో వాహనానికి పెట్రోల్ నింపుతున్న ఉద్యోగిని

రాయవరం: అంది వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. ఆర్థికంగా తమ కాళ్ల మీద నిలబడడానికి పని ఏదైనా ముందుంటున్నారు. విద్యార్థినులు, వివాహిత మహిళలు వివిధ ఉద్యోగాలు చేస్తూ స్వయం సమృద్ధిని సాధిస్తున్నారు. ఆ కోవలోనే క్లస్టర్ పరిధిలో వివిధ పెట్రోలు బంకుల్లో పని చేస్తూ ఉపాధి పొందుతూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న యువతులు, మహిళలు ఇటీవల కాలంలో పెరుగుతున్నారు.

సగానికి సగం

ఒకప్పుడు పెట్రోల్ బంకుల్లో వాహనాల్లో పెట్రోల్ నింపడానికి కేవలం పురుషులు మాత్రమే పని చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. మహిళలే అధికంగా పెట్రోల్ బంకుల్లో పని చేస్తూ అటు కుటుంబానికి కూడా చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్నారు. రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలో 30 వరకూ వివిధ కంపెనీలకు చెందిన పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ బంకుల్లో ఈ పెట్రోల్ బంకుల్లో సుమారుగా 20 మంది వరకు మహిళలు పని చేస్తున్నారు.

కుటుంబానికి చేదోడుగా ఉండాలని..



మహిళలు ఏ పనినైనా చేయగల సమర్థత కలిగి ఉంటారు. ఒకరిపై ఆధార పడకుండా మన పని మనం చేసుకోవడంలో తప్పులేదు. కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలనే పెట్రోల్ బంకులో పని చేస్తున్నాను. నేను చేసే వృత్తి పట్ల సంతృప్తిగానే ఉన్నాను.

– పి.చంద్ర, చిరుద్యోగి, రామచంద్రపురం

మహిళలు ముందుకు వస్తున్నారు



పెట్రోల్ బంకుల్లో పని చేసేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు. ఇది ఆశించదగ్గ పరిణామంగా చెప్పవచ్చు. ఖర్చులు పెరిగి కుటుంబ పోషణ భారంగా మారుతున్న పరిస్థితుల్లో భర్త, భార్య ఇరువురూ సమానంగా చిరుద్యోగాల వైపు మరలుతున్నారు. అందుకే పెట్రోల్ బంకుల్లో సైతం పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– కర్రి సత్యనారాయణరెడ్డి, పెట్రోల్ బంకు యజమాని, మండపేట

అన్నదమ్ముల్లా ఉన్న కులాల మధ్య చిచ్చు

కాజులూరు: ఎస్సీ వర్గీకరణ పేరుతో నేటి పాలకులు అన్నదమ్ముల్లా ఉన్న ఎస్సీ కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పలు గ్రామాలలో పర్యటించి, బుధవారం జరగనున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు ప్రైవేటు పాఠశాలలు, వ్యాపార సంస్థల వారు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కాజులూరులో ఆయన మాట్లాడుతూ కోర్టులను సాకుగా చూపి, రాజకీయ స్వలాభం కోసం పాలకులు విభజన డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. తమ ఆవేదనను పాలకులు, కోర్టులకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. షాపుల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించి బంద్‌కు సహకరించాలని కోరారు. బంద్ సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యకర్తలు, యువకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోరాట సమితి నాయకులు రాజేష్, జల్లి సత్యనారాయణ, మాత స్వామి, నెల్లి బ్రహ్మాజి, గుంటూరి అప్పారావు, జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ వార్షికోత్సవం



రాయవరంలో పోలమ్మ తల్లి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: స్థానికంగా కొలువైన పోలమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఏటా శ్రావణ మాసంలో వచ్చే మూడో మంగళవారం నిర్వహించడం ఆనవాయితీ. వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాయవరం, కొమరిపాలెం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, అనపర్తి మండలం కొప్పవరం, మహేంద్రవాడ తదితర గ్రామాల మహిళలు అధికంగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలు భజన మండళ్ల ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించి భజన పాటలు ఆలపించారు. గ్రామానికి చెందిన ఓంశక్తి సంఘం సభ్యులు, సత్యసాయి సంఘం వారు గీతా పారాయణ చేశారు. ఎంపీపీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ వార్షికోత్సవ వేడుకలను పర్యవేక్షించారు. పోలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, కొప్పు వెలమ సంక్షేమ సంఘం సభ్యులు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

మెడికో హత్యను నిరసిస్తూ విద్యార్థుల ర్యాలీ



వెలగతోడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

మండపేట: కోల్‌కతాలో మెడికోపై అత్యాచారం, హత్యకు నిరసనగా మండలంలోని వెలగతోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు చేతబూని గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ కేసులో దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు వీరభద్రరావు, షఫీరు, అలీ, కృష్ణమూర్తి మాట్లాడుతూ వైద్య విద్యార్థినికి జరిగిన అన్యాయం మరెవరికీ జరగకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలి ఆత్మకు శాంతి కలగాలంటూ ప్రార్థించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- జిల్లా స్థాయి సమావేశం



పీఎంపీల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ల (పీఎంపీ)ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హామీ ఇచ్చారు. ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మండపేటలో వైద్యవిజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక రథం గుడి వద్ద గల నారాయణమూర్తి కల్యాణ మండపంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎంపీలకు ఏసమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం ద్వారా పరిష్కారం అయ్యే సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం, డెల్టా హాస్పిటల్ వైద్య నిపుణులు ఆర్. నితిన్, సుమంత్‌లు తమ ప్రసంగాల్లో శస్త్ర చికిత్సల్లో నూతన వైద్య విధానాల గురించి, క్యాన్సర్ వ్యాధి గురించి వివరించారు. అనంతరం శిక్షణ పొందిన పీఎంపీలకు రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు మట్టా వీరబాబు, బళ్లా వెంకటరమణ, ఇరవాడ రవికుమార్, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, 200 మంది పీఎంపీలు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పీబీఎన్ కుమారి

రామచంద్రపురం రూరల్: గర్భిణులు, బాలింతలు, శిశు ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణతో మొబైల్ ఫోన్ ద్వారా సేవలందించే కిల్కారీ అండ్ మొబైల్ అకాడమీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సు పీబీఎన్ కుమారి సూచించారు. ద్రాక్షారామ, మాచవరం, ద్వారపూడి పీహెచ్‌సీల పరిధిలోని ఆశా నోడల్ అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ నోడల్ అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అవసరమయ్యే సూచనలను ఫోన్ ద్వారా వాయిస్ సందేశాలు ఇస్తారన్నారు. టోల్ ఫ్రీ నంబరు 14423కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.

ప్రైవేట్ స్కూల్ బస్ ప్రమాదంపై విచారణ

మలికిపురం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో ప్రమాదానికి గురైన మలికిపురం భాష్యం స్కూల్ ఉదంతంపై విచారణ నిర్వహించినట్లు ఎంఈఓ–1 ఎం.విజయశ్రీ, ఎంఈఓ–2 వైవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు పాఠశాల వద్దకు వెళ్లి ప్రమాదానికి గురైన బస్‌ను పరిశీలించామన్నారు. ఘటనపై భాష్యం స్కూల్ యాజమాన్యం నుంచి లిఖిత పూర్వక వివరణ కోరినట్లు ఎంఈఓ–2 సత్యనారాయణ తెలిపారు. పాఠశాలల బస్ డ్రైవర్ల తీరుపై త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ విజయశ్రీ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



అవగాహన సదస్సులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రమ్యశైలజ

మామిడికుదురు: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినప్పుడే దోమల నిర్మూలన సాధ్యమని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మగటపల్లి పంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రాణాంతకమైన డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు దోమల వల్లే వ్యాప్తి చెందుతాయన్నారు. దోమ రహిత సమాజం–ఆరోగ్యానికి సోపానం అని ఆమె పేర్కొన్నారు. సదస్సులో దోమల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ యు.దివ్య, ఏఎన్‌ఎం ఆర్.రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ మలుపు.. ప్రమాదాలకు పిలుపు



ద్వారపూడి–యానాం రహదారిపై కోలంక వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కాజులూరు: ద్వారపూడి–యానాం రహదారిలో మండలంలోని కోలంక వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. హైస్కూల్ సమీపంలో పాలమూరుపాడుకు వెళ్లే రహదారి వద్ద ఉన్న ఈ మలుపులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ మలుపు ఇరుకుగా ఉండటానికి తోడు, ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉండటంతో, వాహనాలు అదుపుతప్పుతున్నాయి. దీంతో ప్రతి నెలా రెండు, మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు మృత్యువాత పడిన సంఘటనలు ఉండగా, ఎందరో క్షతగాత్రులయ్యారు. పది రోజుల క్రితం రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన మేకల నాగయ్య బైక్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా, ఇదే సెంటరులో ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో మలుపు వద్ద రోడ్డును విస్తరించి, విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని, హెచ్చరిక బోర్డులను, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం తులసీరామ్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ప్రజలు ఎక్కువగా వస్తువులు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు, ఆర్డర్ పెట్టని వస్తువులు ఇంటికి తెచ్చి, మనది కాదని చెప్పగానే ఆర్డర్ కాన్సిల్ చేస్తున్నానని ఫోన్‌కి వచ్చే ఓటీపీ చెప్పమని అడుగుతున్నారన్నారు. సెల్‌కు వచ్చిన ఓటీపీ చెబితే, బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయమవుతుందన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలను గమనించిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

రోడ్డుపైనే చెత్త కుప్పలు

- మండపేటలో కుంటుపడిన పారిశుధ్య నిర్వహణ
- వ్యర్థాలను తొలగించాలంటూ కమిషనర్‌కు వినతి



గొల్లపుంత రోడ్డు రామచంద్రుడు కాలువలో తీసిన పూడిక, గృహ వ్యర్థాలు



కృష్ణ కల్యాణి నగర్ స్వాగత ద్వారం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

మండపేట: పారిశుధ్య నిర్వహణలో ఒకప్పుడు మంచి పేరు తెచ్చుకున్న మండపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పుడు ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు, మినీ డంపింగ్ యార్డులు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించినందుకు నిన్న మొన్నటి వరకూ మండపేట మున్సిపాలిటీ జిల్లాస్థాయిలో గుర్తింపు పొందింది. ఎందుచేతనో ఇప్పుడున్న అధికారులు పారిశుధ్య నిర్వహణను అంతగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రోజూ వీధుల్లోని తడి,పొడి చెత్తను మాత్రం క్రమం తప్పకుండా పారిశుధ్య సిబ్బంది సేకరిస్తున్నారు. ఎటొచ్చీ ఆ వ్యర్థాలను వీధి చివరన డంపింగ్ స్టాక్ పాయింట్ల వద్ద విడిచి పెట్టేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మినీ డంపింగ్ స్టాక్ పాయింట్ల నుంచి వ్యర్థాలను తరలించడం లేదు. దాంతో ఆ చెత్త నుంచి విపరీతమైన దుర్గంధం వ్యాపిస్తోంది. అదీ గాకుండా ఈ స్టాక్ పాయింట్లు దోమలు, ఈగలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని చెబుతున్నారు.

డంపింగ్ యార్డులా టిడ్కో కాలనీ రోడ్డు

కృష్ణా టాకీస్ ఎదురుగా ఉన్న గొల్లపుంత రామచంద్రుడు కాలువ వద్ద ఉన్న మేన్‌హోల్ నుంచి తీస్తున్న చెత్తను సమీపంలోనే వేస్తున్నారు. అలాగే గొల్లపుంత టిడ్కో కాలనీ రోడ్డును దాదాపు డంపింగ్ యార్డులా మార్చేశారు అక్కడి జనం. పట్టణంలోని ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్త అంతా తీసుకొచ్చి కాలువ వెంబడి దారి పొడవునా వేసి వెళ్లిపోతున్నారు. దానికి తోడు సెప్టిక్ ట్యాంకుల ద్వారా వచ్చిన మల వ్యర్థాలను కూడా రాత్రి వేళల్లో రిక్షాపై తీసుకొచ్చి ఇదే రోడ్డు వారన విడిచిపెట్టి జారుకుంటున్నారు. కాగా మంగళవారం కృష్ణ కళ్యాణి నగర్ స్వాగత ద్వారం వద్ద చెత్తను తొలగించడం లేదంటూ గ్రీన్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు భీమరాజు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతాన్ని పారిశుధ్య కార్మికులు మినీ డంపింగ్ యార్డులా మార్చేడయంతో సమీప అపార్ట్‌మెంట్ వాసులు, దారిన పోయే వారు సైతం దుర్వాసన భరించలేక పోతున్నారు. తరచూ టిడ్కో కాలనీ సందర్శనకు గొల్లపుంత రోడ్డుపై కారుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ అధ్వానంగా ఉన్న పారిశుధ్యం వారికి కనిపించడం లేదా అని టిడ్కో నివాసితులు ప్రశ్నిస్తున్నారు. రామచంద్రుడు కాలువలోని పూడికలు తీసి నెల రోజులైంది. ఆ వ్యర్థాలను అక్కడి నుంచి తరలించకుండా అలాగే వదిలేయడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ తీసిన పూడికను దూరంగా తరలించకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఈదురు గాలులతో దుమారం

- కూలిన చెట్టు, తెగిన విద్యుత్ తీగలు



పెదపళ్ల–వెదురుమూడి రోడ్డులో కూలిన చెట్టు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో మంగళవారం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు దుమారం రేగింది. భారీ గానుగ చెట్టు విరిగిపడింది. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలో పాన్‌షాపు పక్కన ఉన్న చెట్టు కూలడంతో, కొత్తూరు నుంచి వెదురుమూడి వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది, ఆ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో వైర్లన్నీ చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపి, విద్యుత్ తీగలను తొలిగించారు. ఈ ఘటనతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది, సర్పంచ్ ఏడిద సత్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి వి.వేణి హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని, జేసీబీ సాయంతో కూలిన చెట్టును తొలగించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

రాయవరం: మండలంలోని కురకాళ్లపల్లిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లుగా వచ్చిన సమాచారంపై రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబు తన సిబ్బందితో కలసి దాడి చేశారు. గ్రామ శివార్లలోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.1,330ల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుజ్జిబాబు తెలిపారు.

సహజసిద్ధంగా పండిన ఉత్పత్తులతో మేలు

సఖినేటిపల్లి: ప్రకృతి వ్యవసాయంలో సహజసిద్ధంగా పండించిన ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డీఆర్‌డీఏ ఏపీఎం కె.విజయ్ అన్నారు. మంగళవారం అంతర్వేదిపాలెంలో కువైట్ మార్ట్ యూనిట్ ప్రాంగణంలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ, మండల మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్ ఏర్పాటు చేశారు. స్టాల్‌ను ఏపీఎం విజయ్ ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ పి.జోసెఫ్, యూనిట్ ఇన్‌చార్జ్ వై.జూలీ, లలిత కుమారి, చిట్టి స్వరాజ్, పుష్పలత పాల్గొన్నారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

- మట్టి విగ్రహాలకు పెరిగిన గిరాకీ

కొత్తపేట: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 7వ తేదీన వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో వీధివీధినా గణపతి నవరాత్రుల పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో విగ్రహ తయారీదారులు వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. కొత్తపేట, రావులపాలెం ప్రాంతాల్లో విగ్రహ తయారీ కంపెనీలతో పాటు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి విగ్రహాలు తయారుచేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఆయా ప్రాంతాల్లో గణపతి, దేవీ నవరాత్రుల సందర్భంగా దేవతా మూర్తుల విగ్రహాలు తయారుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సుమారు రెండు నెలల ముందు నుంచే విగ్రహాలు తయారీ ప్రారంభిస్తారు. ఈ ఏడాది చవితికి వచ్చిన ఆర్డర్ల మేరకు 2 అడుగుల నుంచి 15 అడుగుల వరకూ భారీ విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో పాటు కొందరు భక్తుల కోరిక మేరకు మట్టితో గణపతి విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. పీఓపీ విగ్రహాలు విశాఖపట్నం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకూ సుమారు 5 వేల విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.2 వేల నుంచి రూ.25 వేల ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు.

రక్తదాన శిబిరం

రాజోలు: సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం రాజోలు ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించి చిరంజీవి అభిమానులను అభినందించారు. కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణి, గుండాబత్తుల తాతాజీ, కోళ్ల బాబి, రేకపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.